సాక్షి
చిత్తూరు
సోమవారం । 20 । నవంబర్ । 2023



జగన్‌తోనే బీసీల అభ్యున్నతి

బీసీల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నారు. - 8లో



క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎంపీపీ అమరావతి సూచించారు. - 8లో



మైలేరు..యువత హుషారు

బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్లలో ఆదివారం మైలేరు పండుగ యువత కేరింతల నడుమ వైభవంగా సాగింది. - 8లో

న్యూస్‌రీల్

వినాయకుని దర్శనానికి 4 గంటలు



క్యూలో భక్తుల రద్దీ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దర్శనానికి 4 గంటల సమయం పడుతుంది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు తరలిరావడంతో కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలన్నీ భక్తులతో నిండిపోయి, ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. దీంతో స్వామివారిని దర్శించుకోవడానికి 4 గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శన ఏర్పాట్లు కల్పించారు.

వార్షిక ప్రణాళికపై నేడు వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్ కాలనీలో సోమవారం వార్షిక ప్రణాళిక, బడ్జెట్ అంశాలపై వార్షిక ప్రణాళిక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే కార్యక్రమాలు, పథకాలపై 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్‌నకు ఎంపిక చేసిన మండల స్థాయి కోర్ బృందాలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

పీఆర్ చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్) చట్టంపై అవగాహన అవసరమని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు పంచాయతీరాజ్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను సులభతరం అయ్యిందని చెప్పారు. గ్రామపాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారుల వరకు ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. పల్లెపాలన పరంగా జీఓ, మెమో, సర్క్యులర్, రూల్ పొజిషన్, బేసిక్స్‌పై అవగాహన అవసరమని డీపీఓ లక్ష్మి తెలిపారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలను అందించడంతోపాటు పన్నుల వసూళ్లపై కార్యదర్శులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం, డీఎల్‌పీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు ఆక్టోపస్ బిల్డింగ్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 70,686 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,563 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.02 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.


సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రేణిగుంట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన సూళ్లూరుపేట నియోజకవర్గం తడ మండలం మాంబట్టు అపాచీ పరిశ్రమ సమీపంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.45 గంటలకు ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. 10.20కి హెలికాప్టర్‌లో బయలుదేరి మాంబట్టు వద్ద హెలీప్యాడ్‌కు 10.45 గంటలకు వెళతారని తెలిపారు. అనంతరం బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుని ప్రసంగిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సందర్శించి, 12.40 గంటలకు బయలుదేరి, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని చెప్పారు.

సుమనోహారం



తిరుమలలో దేవదేవేరులకు స్నపన తిరుమంజనం






పద్మావతీదేవికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్య చరణాలను స్పృశించి సంపంగి.. సెంటు జాజులు.. చామంతి.. రోజా పుష్పాలు సంబరపడ్డాయి. మల్లెలు.. మొల్లలు.. మొగలిరేకులు సుగంధ పరిమళాలు వెదజల్లాయి.. పొగడ.. దేవగన్నేరు.. కలువ.. మనోరంజితం.. పారిజాతం మనోహర సౌరభాలు విరజిమ్మాయి. తులసి.. దవణం.. బిల్వం.. పన్నీరు.. కదిరి పచ్చ పత్రాలు వైకుంఠ నాథుని అర్చనలో సగర్వంగా శోభిల్లాయి. కార్తీక మాసం.. శ్రవణా నక్షత్ర సుముహూర్తాన శ్రీవారి దేవేరి శ్రీపద్మావతీదేవిని అభిషేకించిన విరులు పునీతమయ్యాయి. సుమనోహర సుమాలు అమ్మవారి సన్నిధికి చేరి మురిసిపోయాయి. విశేష వనాల నుంచి దేవదేవేరుల చెంతకు చేరిన పవిత్ర పుష్పపత్రాలు పులకించాయి.

- తిరుమల శ్రీవారి ఆలయంలో వైభవంగా పుష్పయాగం
- తిరుచానూరులో సిరులతల్లికి శోభాయమానంగా విరుల నివేదన
- దేవదేవేరుల సన్నిధిలో విరిసిన సుగంధ పరిమళం



సుగంధ పుష్పాల నడుమ శ్రీవారు



విశేష విరుల నడుమ అమ్మవారు



శ్రీవారి సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల/ తిరుచానూరు (చంద్రగిరి) : కార్తీక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవ సమయంలో తెలిసో తెలియకో జరిగిన దోష నివారణార్థం పుష్పయాగం జరిపించడం ఆనవాయితీ. మొత్తం 8 టన్నుల పుష్పాలను యాగంలో వినియోగించారు. టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

తిరుచానూరులో..

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. సిరులతల్లికి 14 రకాలు పుష్పాలు, 6 రకాల పత్రాలను నివేదించారు. తిరుమల శ్రీవారికి, తిరుచానూరు అమ్మవారికి ఒకే రోజు పుష్పయాగం నిర్వహించడం అపురూపంగా భక్తులు భావిస్తున్నారు.



తిరుచానూరులో పుష్పాలు తీసుకువస్తున్న అర్చకులు, భక్తులు

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన వారు ప్రధానమంత్రి విశ్వకర్మయోజన రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ చేతి వృత్తి పనివారు, హస్తకళల నిపుణులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పరికరాల కొనుగోలుకు ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. అలాగే స్వర్ణకారులు, కార్పెంటర్లు, శిల్పకారులు, కొలిమి, బుట్టలు, చాపలు, పరకలు అల్లేవారు, చెప్పులు కుట్టేవారు, దోబీ, కుమ్మరి, టైలర్లు, తాపీ కార్మికులు, బార్బర్, రాళ్లు కొట్టేవారు, బొమ్మలు తయారీ చేసేవారు, పూలదండలు, తాళాల తయారీదారులకు కూడా ఈ పరికరాలు అందిస్తారన్నారు. ఈ పథకం ద్వారా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు 5 శాతం వడ్డీతో (తిరిగి చెల్లించే పద్ధతి) బ్యాంకుల ద్వారా రుణసహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తుదారుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలని చెప్పారు. ఐదేళ్లలోపు పీఎంఈజీపీ, పీఎం ముద్ర వంటి రుణాలను పొంది తిరిగి చెల్లించని వారు అనర్హులన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటే పథకం వర్తించదన్నారు. వివరాలకు www.pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో కానీ, కలెక్టరేట్‌లోని మైనారిటీ కార్పొరేషన్ కార్యాలయంలో కానీ సంప్రదించాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి, పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

బోయకొండలో భక్తుల రద్దీ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒకసారిగా భక్తుల రద్దీ పెరగడంతో క్యూలన్నీ కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓచంద్రమౌళి పర్యవేక్షించారు. భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

జగనన్నతోనే సంతోషం శాశ్వతం

పాదిరేడులో మంత్రి ఆర్కే రోజా పల్లెనిద్ర





పల్లెనిద్రకు వచ్చిన మంత్రి రోజాకు అవ్వ ఆత్మీయ స్వాగతం, పాదిరేడులో పల్లెనిద్ర చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, ఈ సంతోషం శాశ్వతం కావాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం వడమాలపేట మండలం పాదిరేడు సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనపై ప్రజాతీర్పును అడిగారు. ప్రతి ఇంటా జగనన్న పాలనకు 10కి 10 మార్కులు వేసి, మళ్లీ జగనన్నే రావాలంటూ నినదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంతకం చేసిన క్షణం నుంచి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, అందుకు జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమలవుతున్న అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ బీమా తదితర సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాల లబ్ధితో ప్రతి పేదవాడి మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాలని తేల్చి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం నిర్వహిస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి, ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. అదే జగనన్న చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని రాసిన బోర్డులను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ప్రతి కుటుంబానికి మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌చౌదరి, శేఖర్, సురేష్‌రాజు, నందయ్య, ఉమాపతి, సుదర్శన్, మురళి, మునిబాబు పాల్గొన్నారు.

మరింత సహకారం

- సహకార సంఘాల్లో బహుళ సేవలు
- జిల్లాలో 5 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రతి సహకార పరపతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ సేవలు
- ఇప్పటికే 3 పెట్రోల్ బంకుల నిర్వహణ
- మరో రెండు బంకుల ఏర్పాటుకు చర్యలు



నగరిలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్

చిత్తూరు అగ్రికల్చర్: సహకార రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు రైతులు, ప్రజలకు కూడా బహుళ సేవలు అందించేలా కృషి చేస్తోంది. రైతులు, ప్రజలకు మరింతగా చేరువుగా సేవలందించేందుకు వివిధ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో గ్రామీణులకు సైతం బహుళ సేవలు ఆయా సహకార పరపతి కేంద్రాల్లోనే అందనున్నాయి.

జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

గ్రామీణ ప్రాంతాల్లోనూ జనరిక్ ఔషధ కేంద్రాలను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలోని సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. ప్రధానమంత్రి జనరిక్ ఔషధ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌ల్లోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 4 సహకార సంఘాలు, ఒక సహకార మార్కెటింగ్ సొసైటీలో మొత్తం 5 ప్రధాన మంత్రి జనరిక్ ఔషధ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటిని పలమనేరు, గంగాధరనెల్లూరు, నగరి, వెదురుకుప్పం పీఏసీఎస్‌లతో పాటు చిత్తూరులోని సహకార మార్కెటింగ్ సొసైటీలో ఏర్పాటు చేయనున్నారు. వీటి ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తికాగా, చిత్తూరు, నగరి సంఘాలకు అనుమతి మంజూరు కావాల్సి ఉంది.

కామన్ సర్వీస్ సెంటర్లు

సహకార పరపతి సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్ల(సీఎస్‌సీ) ఏర్పాటుకు చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో రైతులు, ప్రజలు ఏదైనా సర్టిఫికెట్, 1బీ, ఎఫ్‌ఎంబీ, అడంగల్, టికెట్స్ బుకింగ్, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పాన్‌కార్డ్ తదితర సేవల కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడేవారు. ఇలాంటి దోపిడీకి చెక్ పెడుతూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతి పరపతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి, 250 రకాల సేవలు అందిస్తోంది. జిల్లాలో మొత్తం 37 సహకార పరపతి కేంద్రాలు (పీఏసీఎస్) ఉండగా, ఇప్పటికే 25 కేంద్రాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. మిగిలిన 12 సంఘాల్లో కూడా త్వరలోనే సీఎస్‌సీలు ఏర్పాటు చేయనుంది.

పెట్రోల్ బంకుల నిర్వహణ

ఆర్థికంగా బలోపేతానికి జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 5 పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే నగరి, బయ్యప్పగారిపల్లె (రొంపిచెర్ల మండలం), పలమనేరులో పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. మరో రెండు పెట్రోల్ బంకులను సదుం, రామకుప్పంలో ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు.

ఇంటి ముంగిటకే సహకార సేవలు



సహకార రంగ సేవలు గ్రామీణులకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతి పీఏసీఎస్‌లో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి, 250 రకాల సేవలను ప్రజలకు చేరువ చేశాం. అలాగే జిల్లాలో 5 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. వీటిని త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– కె.బ్రహ్మానందరెడ్డి, జిల్లా సహకార శాఖాధికారి

ముక్కంటి ఆలయ ఈఓగా రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నూతన ఈఓగా కేఎస్ రామారావు నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కుటుంబసభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. గతంలో ఆయన శ్రీకాళహస్తి ఆర్డీఓగా విధులు నిర్వర్తించారు. అనంతరం విజయవాడ కనకదుర్గ ఆలయానికి ఈఓగా బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా బాధ్యతలు చేపట్టారు. రామారావు మాట్లాడుతూ ముక్కంటి ఆలయంలో పనిచేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. పాలకమండలి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

గజదాడులతో పంట ధ్వంసం



అయ్యావాండ్లపల్లెలో అరటి తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీలో ఆదివారం తెల్లవారుజామున ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేశాయి. గత రెండు రోజులుగా ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. అరటి, వరి, మామిడి, ముఖ్యంగా డ్రిప్ పైపులను ధ్వంసం చేయడంతో రైతులకు భారీగా పంటనష్టం జరిగింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్ట పోతున్నామన్నారు.


పులికంటి కృష్ణారెడ్డికి నివాళి



నివాళులు అర్పిస్తున్న రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: రాయలసీమ రవిశాస్త్రి పులికంటి కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆయన సాహితీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, కళాకారులు పొన్నాల జేజిరెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, రవి, దీపక్, చెంగయ్య, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పులికంటి కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్‌లో 300 మందికి అన్నదానం చేశారు.

ముంగిటకే సర్టిఫికెట్లు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు ప్రజల ఇంటివద్దకే వెళ్లి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సకాలంలో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్‌లను మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా ముఖ్యమైన సర్టిఫికెట్లను ఉచితంగా పొందామని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్



జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు

ఇంత త్వరగా ఇస్తారనుకోలేదు



నాకు కొత్తగా వివాహం జరిగింది. కొత్త కుటుంబం ఏర్పడింది. అయితే సంక్షేమ పథకాలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉమ్మడి కుటుంబంలోనే చూపుతుండటంతో హౌస్‌హోల్డ్ స్ప్లిట్ కోసం జగనన్న సురక్ష బృందం ఇంటివద్దకు వచ్చిన సమయంలో విన్నవించుకున్నాను. వారు వివరాలు నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో హౌస్‌హోల్డ్ స్ప్లిట్ అయిందంటూ పత్రాలు నా చేతికందించారు. ఇదివరలో హౌస్‌హోల్డ్ స్ప్లిట్ ఎలా చేసుకోవాలని కొందరిని అడిగితే వలంటీర్‌కు సమాచారం అందించి వారు వివరాలు వాకబు చేసి వలంటీర్ లాగిన్‌లో విభజన చేసినట్లు మ్యాపింగ్ చేసి మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లో ఉత్తర్వులు పొందిన తరువాత హౌస్‌హోల్డ్ విభజన జరుగుతుందన్నారు. ఇంత సమయం తీసుకునే ఈ పని జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎలాంటి రుసుము, కష్టం లేకుండా త్వరగా అందజేశారు.

-అముద, నంబాకం దళితవాడ, నగరి మండలం

పత్రాలు ఇంటికే తెచ్చిఇచ్చారు



మేము ఐరాల మండలం అరుణానగర్ కాలనీలో ఉంటున్నాం. గతంలో సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ ఆఫీస్ వద్దకు వెళ్లి గంటల కొద్ది నిరీక్షించేవాళ్లం. అత్యవసరమని అధికారులకు విన్నవించుకున్నా వారు పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించింది. అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మా ఇంటి వద్దకే తెచ్చిచ్చారు. ఒక రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వం ధ్రువపత్రాలను ఇవ్వడం సంతోషకరం. మంజూరు చేసిన ధ్రువపత్రాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

- పి.లత, లబ్ధిదారు, అరుణానగర్ కాలనీ, ఐరాల

రెండు పత్రాలు ఉచితంగా పొందాను



మాది పాలసముద్రం మండలం ఆముదాల దళితవాడ. ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష పథకంలో రెండు పత్రాలను ఉచితంగా పొందాను. నేను గతంలో ఇలాంటి కార్యక్రమాలను చూడనేలేదు. ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను అధికారులు మా వద్దకే తెచ్చి ఇచ్చారు. గతంలో ఈ పత్రాలు పొందాలంటే రూ.500 అత్యవసరం అయితే ఇంకొంత నగదును తీసుకునేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. రూపాయి ఖర్చు లేకుండా ధ్రువపత్రాలను తెచ్చి ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- ఢిల్లీ, లబ్ధిదారుడు, ఆముదాల దళితవాడ, పాలసముద్రం

నెలరోజులు పట్టేది



మాది పూతలపట్టు మండలం ఎగువపాలకూరు గ్రామం. మాకు ఏమైనా సర్టిఫికెట్లు అవసరమైతే గతంలో నెలరోజుల వరకు తిప్పించేవారు. నగదుతో పాటు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. అలాగే ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునేటప్పుడు ముఖ్యమైన సర్టిఫికెట్లు లేకపోవడంతో దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడి ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమంలో శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లోనే ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చారు.

- గణేష్, లబ్ధిదారుడు, పూతలపట్టు

జగన్‌తోనే బీసీల అభ్యున్నతి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్
- చిత్తూరులో మొదలియార్ కులస్తుల ఆత్మీయ సమావేశం
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

చిత్తూరు రూరల్: బీసీల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం మొదలియార్ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మూడు జిల్లాల పరిధిలోని మొదలియార్లను బీసీ జాబితాలో చేర్చారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారన్నారు. సీఎం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొదలియార్లను బీసీ జాబితాలో చేర్చడం హర్షణీయమన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ఆర్థికంగా కూడా బీసీలను ఆదుకుంటున్నారని చెప్పారు. నామినేటడ్, ఇతరాత్ర పదవుల కట్టబెట్టడంలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇక మొదలియార్లు ఐకత్యతో ఉండి, సంఘాన్ని బలపరుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా ఎదుగుదలకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం బుల్లెట్ సురేష్ మొదలియార్లను ఓబీసీలో చేర్చాలని, గంగినేని చెరువు వద్ద మరుదు సోదరుల విగ్రహం ఏర్పాటు చేయాలని, మొదలియార్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకారం అందించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. తరువాత సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రాజశేఖర్ మొదలియార్, బాలాజీ, సుందరం, కల్పన, సుగుణమ్మ, శేఖర్, నవీన్, జ్ఞాన జగదీష్, బుల్లెట్ అప్పు, రామ్ గణేష్, చక్రధర్, కోదండ, శివప్రకాష్, కృష్ణమూర్తి, శివ, ఉదయ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారుల మార్చ్‌పాస్ట్

బంగారుపాళెం: విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎంపీపీ అమరావతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం 67వ అంతర్ జిల్లాల ఖోఖో అండర్-14 బాల బాలికల పోటీలు (రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్) ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ యువతలో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందడానికి క్రీడలు దోహద పడతాయన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా పోటీలు సాగాలన్నారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ మాట్లాడుతూ ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఆధ్వర్యంలో బంగారుపాళెంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించడం సంతోషమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి యువత మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మూర్తి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, జిల్లా కోచ్ బాలాజీ, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్, రాష్ట్ర పరిశీలకులు కేఎం నాయుడు, ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య, ఎస్ఆర్‌ఐ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బోయకొండలో ఈఓ కార్యాలయం ప్రారంభం

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ ఆవరణలో ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నాగారాజారెడ్డి ఆదివా రం ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు బోయకొండ ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రా రంభించి, అనంతరం పలు అంశాలపై చర్చించా రు. తరువాత వారు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలందించడంతోపాటు, సిబ్బంది విధుల పర్యవేక్షణకు వీలుగా ప్రత్యేక కార్యాలయం ఏర్పా టు చేశామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి సహకారంతో బోయకొండ గంగమ్మ ఆలయా న్ని ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకున్నామని చైర్మన్ తెలిపారు. ఆలయం వద్ద రూ.కోట్ల వ్యయంతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట పాలక మండలి సభ్యులు రాజేష్, భాస్కర్‌రెడ్డి, సురేష్ ఉన్నారు.



ఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, చైర్మన్ నాగరాజారెడ్డి

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడు రమేష్‌ను అరెస్టు చూపుతున్న చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్ రెడ్డి

తవణంపల్లె: మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి, ఆదివారం రిమాండ్‌కు పంపినట్లు తవణంపల్లె ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని గాజులపల్లెకు చెందిన మహిళను చెర్లోపల్లె గ్రామానికి చెందిన రమేష్ తన ద్విచక్ర వాహనంలో ఇంటి వద్ద వదులుతానని చెప్పి, నమ్మబలికి ఈచనేరికి వెళ్లే కాలిబాట వైపు తీసుకెళ్లి, ఆమెను బెదిరించి, మామిడి తోటలో బలవంతంగా ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం మహిళ వద్ద ఉన్న రూ.4 వేలు నగదు తీసుకుని, ఎవరికైనా చెబితే చంపుతానని భయపెట్టి, బీసీ కాలనీ వద్ద వదిలి వెళ్లిపోయాడు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు చెర్లోపల్లె రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్ వద్ద నిందితుడు రమేష్‌ను అరెస్టు చేసి, అతని వద్ద రూ.2 వేలు నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుపతిలో 'నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు'



అవుట్ లెట్ ప్రారంభిస్తున్న మంత్రి రోజా

తిరుపతి కల్చరల్ : నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు వారి ఐదు అవుట్ లెట్స్‌ను ఆదివారం తిరుపతిలో ఆరంభించారు. కార్యక్రమానికి మంత్రి ఆర్‌కే రోజా, సినీ నటి మెహరీన్, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి హాజరయ్యారు. నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు వ్యవస్థాపకుడు జబర్దస్త్ ఆర్‌పీ, తిరుపతి అవుట్‌లెట్స్ అధినేతలు ఆవుల వంశీకృష్ణ, ఏడుకొండలు, జి.బాలాజీకిరణ్, కె.చంద్రశేఖర్, ఎం.సుబ్రమణ్యంలతో కలిసి అవుట్ లెట్స్‌ను ప్రారంభించారు. మంత్రి రోజా మాట్లాడుతూ జబర్దస్త్ ఆర్‌పీ నెల్లూరు చేపల పులుసు రుచిని రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు అందుబాటులో తీసుకువచ్చారన్నారు. నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు హోటల్‌ను తిరుపతిలో ప్రారంభిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఆర్‌పీ మాట్లాడుతూ తాము స్థాపించిన నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసుకు విశేష జనాదరణ లభించిందన్నారు. రుచితో పాటు ఆరోగ్యం సైతం అందించే ప్రత్యేక ఫార్ములా జోడించి అనుభవజ్ఞులైన వంట మాస్టర్లతో చేపల వంటకాలు అందిస్తున్నామని వివరించారు. త్వరలోనే చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఫ్రాంచేజీలను అందిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతి అవుట్ లెట్స్ అధినేతలు మాట్లాడుతూ నగరంలో ఐదు అవుట్ లెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొరమేను, గండి, రవ్వ, బొమ్మిడాయిలు, సన్న చేపలు, తలకాయ చేపల పులుసు, రాగి సంగటి, వైట్‌రైస్ అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి చిల్లీస్ హోటల్స్ అధినేత అంజి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల

చిత్తూరు కార్పొరేషన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విజయం కళాశాలలో దిశచట్టం, మహిళ సాధికారత అంశంపై విద్యార్థులతో మాట్లాడారు. ఇంటి నిర్వహణతో పాటు బయట విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్త్రీ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన పెంపొందించుకోవాలని దిశ ఎస్ఐ నాగసౌజన్య తెలిపారు. మహిళలు శారీరకంగా కూడ దృఢంగా ఉండాలన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య విషయాలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రోజాప్రియ తెలిపారు. తాను చిన్నతనంలో గ్రంథాలయాలకు వచ్చి పలు రకాల పుస్తకాలను చదివానని చెప్పారు. నిత్య జీవితంలో గ్రంథ పఠనం దినచర్యగా చేసుకోవాలని డీపీఆర్వో పద్మజ తెలిపారు. పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు విమల అన్నారు. అనంతరం విమల అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, గ్రంథాలయాధికారులు లలిత, మధుబాబు, గుణశేఖర్, పూర్ణిమ, తులసీకుమార్, దేవిబాల, సరస్వతి, శిరీష, లవకుమార్, రాజశేఖర్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



మైలేరు.. యువత హుషారు

బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్లలో ఆదివారం మైలేరు పండుగ యువత కేరింతల నడుమ వైభవంగా సాగింది. ఉదయం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేసి పశువులను పందెం బరిలో వదిలిపెట్టారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పశువులు భారీగా పరుగుపందెంలో పాల్గొన్నాయి. పశువులకు సినిమా పేర్లు, సినీ నటుల పేర్లు, జంతువుల పేర్లు పెట్టి పరుగుపందెంలో వదిలిపెట్టడంతో దూసుకెళుతున్న వాటిని నిలువరించేందుకు పలువురు యువకులు పోటీ పడ్డారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులు చర్యలు తీసుకున్నారు.

- బైరెడ్డిపల్లె